మార్కెట్లకు దసరా శోభ

- పండ్లు, పూలకు పెరిగిన డిమాండ్
- నిమ్మకాయలకు గిరాకీ
- జనంతో కిక్కిరిసిన బజార్లు


పువ్వులు కొనుగోలు చేస్తున్న వినియోగదారులు


నిమ్మకాయల దుకాణాల వద్ద కిక్కిరిసిన జనం

జగదాంబ : పూర్ణామార్కెట్ దసరా సందడి సంతరించుకుంది. శనివారం విజయ దశమి సందర్భంగా ప్రజలు పూజాసామగ్రి కొనుగోలుకు పూర్ణామార్కెట్‌కు భారీగా తరలివచ్చారు. ఈ సందర్భంగా మార్కెట్ లోపల, బయట దుకాణాలు అధికంగా వెలిశాయి. పువ్వుల ధరలు ఆకాశాన్ని అంటాయి. వంద గ్రాముల పువ్వులు రూ. 150 వరకు అమ్మకాలు చేశారు. దిష్టిపూసల దండల దుకాణాలు ఎక్కువగా వెలిశాయి. ధరలు అందరికి అందుబాటులో ఉన్నాయి. నిమ్మకాయలు రూ.20కి కేవలం మూడు అమ్మకాలు చేశారు. కలకూర సరకులు బాగా అమ్ముడుపోయాయి. యాపిల్ పండ్లు కిలో రూ.300కి అమ్మకాలు చేస్తే, అరటిపండ్లు కిలో రూ. 100కి పైగా విక్రయించారు. పత్రి ధరలు సైతం అందుబాటులో లేవు. ఈ సందర్భంగా వన్‌టౌన్ లా అండ్ ఆర్డర్ పోలీసులు జేబుదొంగలపై నిఘా ఏర్పాటు చేశారు. ఇసుక వేస్తే రాలనంతగా మార్కెట్‌లో జనాలు కిక్కిరిసిపోయారు.

సందేట్లో సడేమియా..
దసరా నేపథ్యంలో ఆశీలు వసూళ్లు అధికంగా చేశారని వ్యాపారులు ఆరోపిస్తున్నారు. వాస్తవంగా జంగిడీకి రూ.10 వసూలు చేయాల్సి ఉండగా నచ్చినంత వసూలు చేసినట్లు వ్యాపారులు వాపోయారు. తమల పాకుల గంప, ప్లాస్టిక్ దండలు, దిష్టిదండలు, మార్కెట్‌లో షోడాలమ్ముకునే చిరు వ్యాపారుల నుంచి తోచినంత ఆశీలు వసూలు చేసినట్లు ఆరోపించారు. జీవీఎంసీ అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని వ్యాపారులు కోరుతున్నారు.


అమ్మకానికి సిద్ధంగా మామిడి తోరణాలు

దసరా ఉత్సవాలకు సిద్ధం..


పూలదుకాణం


వాటర్ సర్వీసింగ్ సెంటర్ వద్ద హడావుడి

అల్లిపురం : దసరా ఉత్సవాలకు నగరం సిద్ధమయింది. దశమి శనివారం రావటంతో మాంసం ప్రియులకు దసరా ఆదివారమనే చెప్పవచ్చు. శనివారం, ఆదివారం రెండు రోజులు సెలవులు కావడంతో రెండు రోజుల పండగను సెలబ్రేట్ చేసుకునేందుకు నగర ప్రజలు సమాయాత్తమవుతున్నారు. పండగ నేపథ్యంలో వాటర్ సర్వీసెంగ్ సెంటర్ల వద్ద వాహనాలు బారులు తీరాయి.

నాటు కోళ్లకు డిమాండ్..
దసరా సందర్భంగా నాటుకోళ్లు కొనేందుకు నగర వాసులు ఉత్సాహం చూపించారు. రామకృష్ణా మార్కెట్ జంక్షన్‌లో నాటుకోళ్ల అమ్మకాలు జోరుగా సాగాయి. రెండు నాటు కోళ్లు రూ.2500 నుంచి రూ.3500 వరకు అమ్మకాలు జరిపారు. రూ.10 విలువ చేసే మామిడి కొమ్మలను రూ.50కి విక్రయించారు. యాపిల్, కమలా, బత్తాయి, కొబ్బరి కాయల ధరలు, ఇతర పండ్ల ధరలు భారీగా పెంచి విక్రయించారు. డజను చామంతులు రూ.20 నుంచి రూ.30 అమ్మకాలు జరిపారు. అరటి ఆకులు ఒకటి రూ.5 నుంచి రూ.10, డజను అరటి పండ్లు రూ.80 నుంచి రూ.120, కొబ్బరికాయ రూ.25 నుంచి రూ.40కు అమ్మకాలు జరిపారు.


నాటు కోళ్లు కొనుగోలు చేస్తున్న నగరవాసి

ఎలక్ట్రానిక్ దుకాణాల వద్ద రద్దీ..
ప్రభుత్వ, ప్రైవేట్ ఉద్యోగస్తులకు దసరా బోనస్ రావటంతో అందుకు గుర్తుగా ఇంట్లోకి అవసరమైన ఎలక్ట్రానిక్ వస్తువులు కొనుగోలు చేసేందుకు నగర ప్రజలు ఎలక్ట్రానిక్ దుకాణాలకు బారులు తీరారు.

క్లుప్తంగా

నర్సుల ఎన్నికకు చురుగ్గా ఏర్పాట్లు


ఎన్నికల అధికారి శ్రీనివాస్

మహారాణిపేట: ఆంధ్రప్రదేశ్ గవర్నమెంట్ నర్సుల అసోసియేషన్ జిల్లా కార్యవర్గ ఎన్నికల నిర్వహణకు సన్నాహాలు చేస్తున్నారు. జిల్లా యూనిట్ ఎన్నికలు రహస్య బ్యాలెట్ విధానం ద్వారా జరగనున్నాయి. అధ్యక్ష, ఉపాధ్యక్ష, కార్యదర్శి, కోశాధికారి పదవికి ఒక్కొక్క పోస్టు ఉంది. పాలకవర్గ సభ్యులుగా ఐదుగురికి ఎన్నికలు నిర్వహించడానికి ఈనెల 16న నామినేషన్ల స్వీకరణ కార్యక్రమం జరుగుతుంది. ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటలలోపు కేజీహెచ్ నర్సస్ క్లాక్ రూమ్‌లో నామినేషన్ల స్వీకరణ కార్యక్రమం జరుగుతుందని ఎన్నికల అధికారి, సహకార శాఖ అసిస్టెంట్ రిజిస్ట్రార్ బి.శ్రీనివాస్ తెలిపారు. నామినేషన్ల పరిశీలన ఈనెల 17 ఉదయం 10 గంటల నుంచి జరుగుతుందని, 18 సాయంత్రం 5 గంటలలోపు నామినేషన్ల ఉపసంహరణ జరుగుతుందని వివరించారు. ఈనెల 23న ఎన్నికలు నిర్వహించడానికి ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఉదయం 8 నుంచి సాయంత్రం 5 గంటల వరకు కేజీహెచ్‌లో పోలింగ్ జరుగుతుందని, అనంతరం ఓట్ల లెక్కింపు మొదలు అవుతుందన్నారు. రూ.వెయ్యి ఫీజు చెల్లించి నామినేషన్ పత్రాలు స్వీకరించాలని ఎన్నికల అధికారి శ్రీనివాస్ తెలిపారు. అధ్యక్ష, ఉపాధ్యక్ష, కార్యదర్శి, కోశాధికారి పదవులకు నామినేషన్ ఫీజు రూ.1000, కార్యవర్గ సభ్యుల కోసం రూ. 500 చెల్లించాలన్నారు.

ప్రతి వారం అన్నదానం


అన్నదానం చేస్తున్న కర్రి మురళీకృష్ణారెడ్డి

సీతమ్మధార: జీవీఎంసీ 24వ వార్డు రేసపువానిపాలెంలో కేఎస్ఎస్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో శుక్రవారం అన్నదానం చేశారు. ట్రస్ట్ అధ్యక్షుడు కర్రి మురళీకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో భక్తులకు అన్నప్రసాదం వడ్డించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతి వారం ఈ ప్రాంతంలో 108 మందికి అన్నదానం చేస్తున్నట్లు తెలిపారు. ట్రస్టు ఆధ్వర్యంలో పేద విద్యార్థులు, ప్రజల కోసం సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని చెప్పారు. ట్రస్టు సభ్యులు కె.సత్యనారాయణరెడ్డి, కె.సీతయ్యమ్మ, కె.సుబ్బలక్ష్మి, ఆలయ కమిటీ ప్రెసిడెంట్ గురునాథ్‌రెడ్డి, సెక్రటరీ బాచి పాల్గొన్నారు.

దారి దోపిడీకి పాల్పడిన ఇద్దరి అరెస్ట్

అల్లిపురం : దారి దోపిడీకి పాల్పడిన ఒక మైనరు సహా ఒక వ్యక్తిని టూటౌన్ క్రైం పోలీసులు శుక్రవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. క్రైం ఎస్ఐ సునీల్ తెలిపిన వివరాల ప్రకారం మేల్కాపురం, దుర్గానగర్‌కు చెందిన పరపతి తారక్ ఈ నెల 8వ తేదీ రాత్రి 11.45 గంటలకు తన తల్లిని హైదరాబాద్ వెళ్లేందుకు ఆర్టీసీ కాంప్లెక్స్‌లో బస్సు ఎక్కించేందుకు వెళ్లాడు. తర్వాత తెల్లవారు జామున 4 గంటల సమయంలో ఆర్టీసీ కాంప్లెక్స్ నుంచి రైల్వే స్టేషన్ వైపు నడిచి వెళ్తుండగా సౌత్ జైలు రోడ్డులో గల భీమ్‌నగర్ వద్దకు వచ్చే సరికి హీరో హోండా బైక్‌పై ఒక మైనర్ సహా ఒక వ్యక్తి తారక్‌ను అడ్డగించి బటన్ నైఫ్‌తో బెదిరించి డబ్బులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇవ్వకపోతే కత్తితో పొడుస్తామని బెదిరించటంతో అతని వద్ద గల రూ.200 ఇచ్చి భయపడి అక్కడి నుంచి ఇంటికి వెళ్లిపోయాడు. మరుసటి రోజు టూటౌన్ క్రైం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో నగర క్రైం డీసీపీ కె. లతామాధురి ఆదేశాల మేరకు ఏసీపీ ఎ. వెంకటరావు ఆధ్వర్యంలో ఈస్ట్ క్రైం సీఐ సీహెచ్ రాజులనాయుడు పర్యవేక్షణలో ఎస్ఐ ఎన్.సునీల్ తన సిబ్బందితో కలిసి దర్యాప్తు చేశారు. దర్యాప్తులో గొల్లల పాలెం మెయిన్‌రోడ్డు, భానోజీనగర్‌కు చెందిన నిమ్మతోర్ల పవన్‌కుమార్, మరో మైనర్ బాలుడు బాధితుడిని అడ్డగించి దారిదోపిడీ చేసినట్లు గుర్తించారు. నిందితులిద్దరు నాల్గవ పట్టణ పోలీస్ స్టేషన్ పరిధి దొండపర్తిలో హీరో హోండా స్ప్లెండర్ ప్లస్ బైక్‌ను దొంగతనం చేసి, అదే బండిపై దారి దోపిడీకి పాల్పడినట్లు తెలిపారు. నిందితులిద్దరిని అరెస్ట్ చేసిన పోలీసులు మైనర్‌ను చైల్డ్ హోంకు అప్పగించారు.

పెళ్లి చేసుకుంటానని నమ్మించి లైంగిక దాడి

యువకుడిపై యువతి ఫిర్యాదు

అల్లిపురం: ప్రేమ, పెళ్లి పేరుతో ఓ యువకుడు నమ్మించి తనపై లైంగిక దాడికి పాల్పడ్డాడని వన్‌టౌన్ పోలీసులకు ఓ యువతి ఫిర్యాదు చేసింది. ఈ కేసుకు సంబంధించి సీఐ భాస్కరరావు తెలిపిన వివరాలివీ.. బాధితురాలిది శ్రీకాకుళం జిల్లా ఎచ్చెర్ల. తన తల్లిదండ్రులతో పండావీధిలో నివాసం ఉంటోంది. ఆమె డిగ్రీ పూర్తి చేసి.. ఇంటి వద్దనే ఉంటోంది. 2020లో తన సోదరుడి స్నేహితుడు గుజ్జు ప్రసాద్‌తో ఇన్‌స్టాగ్రామ్‌లో ఆమెకు పరిచయం ఏర్పడింది. సోదరుడు స్నేహితుడు కావడంతో ఆమె అతని ఫ్రెండ్ రిక్వెస్ట్‌ను ఆమోదించింది. ఈ క్రమంలో ప్రేమిస్తున్నానని పదే పదే ఆమెకు చెప్పేవాడు. కాగా.. యువతి సోదరుడు 2022లో ప్రమాదవశాత్తు మరణించాడు. దీంతో పెళ్లి చేసుకుంటానని ప్రసాద్ ఆమెను ఒత్తిడి చేయడంతో అంగీకరించింది. అప్పటి నుంచి అతను తరచూ ఆమె ఇంటికి వస్తుండేవాడు. తల్లిదండ్రులు లేని సమయంలో ఆమెతో శారీరకంగా కలిసే వాడు. ఇదిలా ఉండగా ప్రసాద్‌కు ఓ ప్రైవేట్ కంపెనీలో ఉద్యోగం రావడంతో ట్రైనింగ్ నిమిత్తం వేరే ప్రాంతానికి వెళ్లాడు. 2023లో సెలవులకు ఆమె ఇంటికి వచ్చాడు. అదే ఏడాది డిసెంబర్ నుంచి ప్రసాద్ ఆమెతో మాట్లాడటం మానేశాడు. దీనిపై బాధితురాలు పలుమార్లు ప్రసాద్‌ను అడిగినప్పటికీ అతని నుంచి ఎటువంటి సమాధానం రాలేదు. చివరికి నీతో పెళ్లి ఇష్టం లేదని చెప్పడంతో ఆమె ఈ విషయాన్ని పెద్దల దృష్టికి తీసుకెళ్లింది. వారు ప్రసాద్‌ను హెచ్చరించినప్పటికీ అతను ఆమెతో పెళ్లికి నిరాకరించాడు. దీంతో బాధితురాలు శుక్రవారం వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో ప్రసాద్‌పై ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

జయమునీయవే.. జగదేక మాత


కన్య పూజలో పాల్గొన్న భక్తులు

- వేడుకగా దసరా నవరాత్రి ఉత్సవాలు
- మహిషాసురమర్దినిగా దర్శనమిచ్చిన దుర్గాదేవి


కనకమహాలక్ష్మికి పూజలు చేస్తున్న వాసుపల్లి గణేష్‌కుమార్


మహిషాసురమర్దినిగా అనఘాలక్ష్మీదేవి


మహిషాసురమర్దినిగా సాగరగిరి కనకదుర్గమ్మ


సౌభాగ్య వ్రతంలో పాల్గొన్న మహిళలు


దుర్గాదేవికి పూజలు చేస్తున్న నాల్గవ తరగతి ఉద్యోగులు


కుంకుమ పూజల్లో పాల్గొన్న మహిళలు

అల్లిపురం : శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం అమ్మవారు భక్తులకు మహిషాసుర మర్దినిగా దర్శనమిచ్చారు. నియోజకవర్గంలో పలు ప్రాంతాల్లో అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు బారులుతీరారు. ఈ సందర్భంగా కన్య పూజలు నిర్వహించారు.

మహిషాసుర మర్దినిగా సాగర గిరి దుర్గమ్మ..
యారాడ కొండపై వెలసిన సాగర గిరి కనకదుర్గమ్మ దేవాలయంలో శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా అమ్మవారికి ఆలయ అర్చకుడు ఫణికుమార్ శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక అభిషేకాలు చేపట్టారు. అనంతరం అమ్మవారిని మహిషాసుర మర్దినిగా అలంకరించారు. అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు బారులుతీరారు.

మహిషాసుర మర్దినిగా ఉమాదేవి..
టూటౌన్ దరి శ్రీ శివరామకృష్ణ దేవస్థానంలో వెలసిన ఉమాదేవి అమ్మవారు మహిషాసుర మర్దినిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ అర్చకుడు భార్గవ శర్మ అమ్మవారిని దుర్గాదేవిగా అలంకరించారు. ఈ సందర్భంగా అమ్మవారికి భక్తులు కుంకుమ పూజలు, విశేష పూజలు నిర్వహించారు.

అనఘాలక్ష్మీ దేవి ఆలయంలో..
వివేకానందకాలనీలోని శ్రీ సాయి దర్బార్‌లో వెలసిన అనఘాలక్ష్మీ, రాజశ్యామల, వారాహి అమ్మవారి ఆలయంలో శరన్నవరాత్రి ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. దీంట్లో భాగంగా అమ్మవారు భక్తులకు మహిషాసురమర్దినిగా దర్శనమిచ్చారు.

భక్తిశ్రద్ధలతో కుంకుమపూజలు..
అచ్చియ్యమ్మపేటలో వెలసి శ్రీ షిర్డీసాయిబాబా ధ్యాన మందిరంలో విజయదశమి వేడుకలు, శ్రీ షిర్డీ సాయిబాబా 106వ మహాసమాధి (పుణ్యతిథి) మహోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. దీంట్లో భాగంగా శుక్రవారం కుంకుమ పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారికి కుంకుమ పూజలు చేశారు.

నేడు మహాసమాధి వేడుకలు..
విజయ దశమి సందర్భంగా శనివారం ఆలయంలో శ్రీ షిర్డీ సాయిబాబా మహాసమాధి (పుణ్యతిథి) మహోత్సవాలు ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వాహకులు నాగరాజు తెలిపారు. ఈ సందర్భంగా ఉదయం నుంచి సాయిబాబాకు ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు జరుగుతాయన్నారు. మధ్యాహ్నం 106 జ్యోతులను భక్తులు వెలిగించి, 108 నైవేద్యాలు సాయికి సమర్పించనున్నట్లు తెలిపారు. భక్తులు పాల్గొని సాయిబాబా ఆశీస్సులు పొందాలని కోరారు.

మానసాదేవిగా కన్యకాపరమేశ్వరి..
డాబాగార్డెన్స్ : పాతనగరం కురుపాం మార్కెట్ సమీపాన వెలసిన కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆలయంలో నిర్వహిస్తున్న దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా తొమ్మిదో రోజు శుక్రవారం మానసాదేవిగా కన్యకాపరమేశ్వరి భక్తులకు దర్శనమిచ్చారు. దేవస్థాన ప్రధాన అర్చకుడు ఆర్‌బీబీ కుమార్‌శర్మచే సౌభాగ్య వ్రతం నిర్వహించారు. వ్రతంలో పెద్ద ఎత్తున మహిళలు పాల్గొన్నారు. కన్యకాపరమేశ్వరి శనివారం మహిషాసురమర్దినిగా దర్శనమివ్వనున్నట్టు ఉత్సవ కమిటీ ప్రతినిధులు తెలిపారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ చైర్మన్లు కరిమిశెట్టి వెంకటరమణ, వెదుళ్లపల్లి శ్రీనివాసరావు, పూసర్ల సంజీవి, దేవాలయ అధ్యక్షుడు అరిశెట్టి దినకర్, కార్యదర్శి పెనుగొండ కామరాజు, కోశాధికారి దోమ వెంకట బాలాజీకుమార్, ఆలయ కమిటీ, ఉత్సవ కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

మహాలక్ష్మిగా కనకమహాలక్ష్మి..
శరన్నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా శుక్రవారం కనకమహాలక్ష్మి అమ్మవారు మహాలక్ష్మి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారికి పలు రకాల కూరగాయలతో శాకంబరిగా పూజలు నిర్వహించారు. ఉత్సవాల్లో భాగంగా సంకల్పం, మండపారాధన, కలశస్థాపన, సప్తశతి, మహావిద్యా, శ్రీచక్ర నవావర్ణార్చన జరిపారు. అమ్మవారికి అలంకరించిన పట్టు చీరలను లక్కీ షాపింగ్ మాల్, సౌత్ ఇండియా షాపింగ్ మాల్ యాజమాన్యాలు అందజేశాయి. శనివారం స్వర్ణలక్ష్మి అలంకరణలో కనకమహాలక్ష్మి దర్శనమివ్వనున్నారని, 108 బంగారు పుష్పాలతో స్వర్ణ పుష్పార్చన చేస్తామని ఈవో కె.శోభారాణి తెలిపారు. ఏఈవో కె.తిరుమలేశ్వరరావు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

మహిషాసురమర్దినిగా దుర్గాలమ్మ..
జీవీఎంసీ 35వ వార్డు వెలంపేటలో వెలసిన దుర్గాదేవి ఆలయంలో శుక్రవారం అమ్మవారు మహిషాసురమర్దినిగా భక్తులకు దర్శనమిచ్చారు. పెద్ద ఎత్తున భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు సమర్పించుకున్నారు. భవనామాల ధార భక్తులు ప్రత్యేక పూజలు జరిపారు. శనివారం రాజరాజేశ్వరీదేవిగా దుర్గాలమ్మ దర్శనమివ్వనున్నారు. సాయంత్రం ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను అలరించాయి.

మహిళా భక్తులకు గాజుల పంపిణీ..
శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా కనకమహాలక్ష్మి అమ్మవారు వివిధ రూపాల్లో దర్శనం ఇస్తున్న విషయం తెలిసిందే. గజలక్ష్మిగా దర్శనమిచ్చిన కనకమహాలక్ష్మికి లక్ష గాజులతో పూజ నిర్వహించారు. ఆ గాజులను భక్తులకు శుక్రవారం ఆలయ ఈవో కె. శోభారాణి అందజేశారు. కార్యక్రమంలో ఏఈవో కె. తిరుమలేశ్వరరావు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


మహిషాసురమర్దినిగా దర్శనమిస్తున్న వెలంపేట దుర్గాలమ్మ

కనకమహాలక్ష్మిని దర్శించుకున్న వాసుపల్లి..
శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శాకాంబరి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చిన కనకమహాలక్ష్మిని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త వాసుపల్లి గణేష్‌కుమార్ శుక్రవారం దర్శించుకున్నారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు జరిపారు. విశాఖను కాపాడుతున్న కనకమహాలక్ష్మి కరుణా కటాక్షాలు సమస్త జీవరాశిపై ఉండాలని వాసుపల్లి ఆకాంక్షించారు.

దుర్గాలమ్మను దర్శించుకున్న వాసుపల్లి..
జీవీఎంసీ 35వ వార్డు పూర్ణామార్కెట్ వెలంపేటలో వెలసిన దుర్గాలమ్మను వాసుపల్లి గణేష్‌కుమార్ దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపారు. అమ్మవారిని దర్శించుకోవడంతో మనశ్శాంతి కలుగుతుందన్నారు. దసరా సంబరాలు రాష్ట్రంలో ప్రజలందరూ సంతోషంగా జరుపుకోవాలని ఆకాంక్షించారు.

జ్ఞానాపురంలో..
కంచరపాలెం: భీమేశ్వర ఆటో, ట్యాక్సీ స్టాండ్ ఓనర్స్ అండ్ డ్రైవర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం దుర్గాదేవి అమ్మవారికి ప్రత్యేక పూజలు జరిగాయి. జీవీఎంసీ 41వ వార్డు జ్ఞానాపురం రైల్వేస్టేషన్ పరిధిలో వార్డు కార్పొరేటర్ కోడిగుడ్ల పూర్ణిమ, వైఎస్సార్‌సీపీ క్లస్టర్ ఇన్‌చార్జి కోడిగుడ్ల శ్రీధర్ పాల్గొని అమ్మవారికి పూజలు చేశారు. మధ్యాహ్నం భక్తులకు ప్రసాద వితరణ చేశారు. అన్నసమారాధనకు భారీ విరాళంగా రూ.80 వేలు అసోసియేషన్ సభ్యులకు కార్పొరేటర్ కోడిగుడ్ల పూర్ణిమ దంపతులు అందజేశారు. కార్యక్రమంలో ఆటో డ్రైవర్లు తదితరులు పాల్గొన్నారు.

దుర్గాదేవి విగ్రహ ప్రతిష్ట..
మహారాణిపేట: విజయదశమి సందర్భంగా కలెక్టరేట్ ఆవరణలో శుక్రవారం ఉదయం 9 గంటలకు దుర్గాదేవి విగ్రహ ప్రతిష్ట కార్యక్రమం నిర్వహించారు. విశాఖ జిల్లా నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో దుర్గాదేవి పూజా కార్యక్రమం నిర్వహించారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఈగల శ్రీనివాసరావు, జిల్లా సంఘం అధ్యక్షుడు నమ్మి శ్రీనివాసరావు, గౌరవ అధ్యక్షుడు ఒమ్మి పెద్దరావు, ప్రధాన కార్యదర్శి వియ్యపు నాగయ్య, హౌస్ బిల్డింగ్ సొసైటీ అధ్యక్షుడు వి. నాగేశ్వరరావు, జిల్లా మాజీ అధ్యక్షుడు నమ్మి సూర్యరావు, హౌస్ బిల్డింగ్ సొసైటీ డైరెక్టర్ ఆర్. జోగి నాయుడు, జిల్లా కోశాధికారి ఉప్పలి చిన్నారావు, ఆర్. ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.


జ్ఞానాపురంలో దుర్గాదేవికి కుంకుమ పూజ చేస్తున్న కార్పొరేటర్ పూర్ణిమ, శ్రీధర్


శివరామకృష్ణ దేవస్థానంలో మహిషాసుర మర్దినిగా ఉమాదేవి


దుర్గాలమ్మకు పూజలు చేస్తున్న వాసుపల్లి


మహిళలకు గాజులు అందజేస్తున్న ఈవో శోభారాణి

హుదూద్ గాయానికి పదేళ్లు


బోల్తాపడ్డ పడవ (ఫైల్)


ముక్కలైన మర పడవలు, బోట్లను వెలికి తీస్తున్న దృశ్యం (ఫైల్)

డాబాగార్డెన్స్ : హుదూద్ తుపాన్ వచ్చి పదేళ్లయింది. 2014 అక్టోబర్ 11 అర్ధరాత్రి నుంచి 12వ తేదీ రాత్రి 7 గంటల వరకు వీచిన బలమైన ఈదురు గాలులకు విశాఖపట్నం అతలాకుతలమైంది. ఒకప్పటి విశాఖతో పోల్చుకుంటే హుద్‌హుద్ తుపాన్ వచ్చిన తర్వాత విశాఖపట్నం మోడు వారింది. వృక్షాలు నేలకొరిగాయి. బస్టాపులు గాలికి ఎగిరాయి. హోర్డింగులు ఎక్కడికెక్కడో పడ్డాయి. మరపడవలు నీట మునిగాయి. మత్స్యసంపదకు తీవ్ర నష్టం వాటిల్లింది. విద్యుత్ వ్యవస్థ అతలాకుతలమైంది. రవాణా వ్యవస్థ స్తంభించింది. రైళ్ల రాకపోకలు నిలిచిపోయాయి. విమాన వ్యవస్థ పని చేయలేదు. టీవీల్లో చూస్తున్న వారందరూ విశాఖకు ఏమైందోనంటూ ఆందోళన చెందారు. హుద్‌హుద్ తుపాన్ వచ్చి పదేళ్లయినా నగర వాసుల్లో ఆ జ్ఞాపకాలు ఇంకా మెదలుతూనే ఉన్నాయి.

ఫిషింగ్ వ్యవస్థ అస్తవ్యస్తం..
హుదూద్ తుపాన్ కారణంగా ఫిషింగ్ హార్బర్‌లో 63 మరబోట్లు పూర్తిగా నీట మునిగాయి. వందల సంఖ్యలో బోట్లు ధ్వంసమయ్యాయి. ఫైబర్ బోట్లు దెబ్బతిన్నాయి. మత్స్య సంపదకు తీవ్ర నష్టం వాటిల్లింది.

మూగ జీవి మౌన వేదన

విజయదశమి నేపథ్యంలో కాన్వెంట్ జంక్షన్‌లో మేకలను విక్రయించడానికి పెద్ద సంఖ్యలో వాహనంలో కుక్కి తీసుకువచ్చారు. ఈ క్రమంలో ఒక మేక తప్పించుకుని రోడ్డుపై పరుగు తీసింది. మేకల కాపరులు వెంటనే స్పందించి దానిని వెంబడించి పట్టుకున్నారు. కొంతసేపు జరిగిన హడావుడి తర్వాత మేకను మళ్లీ వ్యానులోకి చేర్చారు.


ఫొటో : సాక్షి ఫొటోగ్రాఫర్ విశాఖపట్నం